అంతరిక్ష కేంద్రానికి నలుగురు

కేప్ కెనావెరాల్ స్పేస్ ఫోర్స్ స్టేషన్ నుంచి పయనం

భర్తీ కాబోతున్న నాలుగు స్థానాలు

కేప్ కెనావెరాల్: అంతరిక్ష అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్) నుంచి అనారోగ్య కారణాలతో భూమికి తిరిగివచ్చిన నలుగురు వ్యోమగాముల స్థానాన్ని మరో నలుగురు భర్తీ చేయబోతున్నారు. అమెరికాలోని కేప్ కెనావెరాల్ స్పేస్ ఫోర్స్ స్టేషన్ నుంచి ఈ నలుగురు స్పేస్ఎక్స్ సంస్థ రాకెట్‌లో శుక్రవారం బయలుదేరారు. శనివారం ఐఎస్ఎస్‌కు చేరుకుంటారు. దాదాపు తొమ్మిది నెలలపాటు అక్కడే ఉంటారు. అంతరిక్ష ప్రయోగాల్లో పాలుపంచుకుంటారు. వీరిలో ఇద్దరు అమెరికా వ్యోమగాములు జెస్సికా మెయిర్, జాక్ హాథ్‌వే, ఫ్రాన్స్ వ్యోమగామి సోఫీ అడెనోట్, రష్యా వ్యోమగామి ఆంద్రీ ఫెడియేవ్ ఉన్నారు. అనారోగ్యానికి గురైన నలుగురు వ్యోమగాములను అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా'గత నెలలో అత్యవసరంగా వెనక్కి రప్పించింది. భూమికిపైకి చేరుకోగానే వెంటనే ఆసుపత్రిలో చేర్పించి, చికిత్స ప్రారంభించారు. వారు ఎవరు? ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి ఏమిటన్నదానిపై నాసా గోప్యత పాటిస్తోంది. వివరాలు బహిర్గతం చేయడంలేదు. అంతరిక్ష ప్రయోగాల్లో నిమగ్నమైన వ్యోమగాములను ఇలా హఠాత్తుగా మధ్యలోనే వెనక్కి రప్పించడం ఐఎస్ఎస్ చరిత్రలో ఇదే మొదటిసారి కావడం గమనార్హం. ఐఎస్ఎస్‌లో నాలుగు స్థానాలు ఖాళీ కావడంతో ప్రయోగాలకు అంతరాయం కలిగే అవకాశం ఉంది కాబట్టి తక్షణమే నలుగురిని అక్కడికి పంపించడానికి నాసా చర్యలు చేపట్టింది. ఎలాన్ మస్క్ సారథ్యంలోని స్పేస్ఎక్స్ సంస్థ సహకారంతో ఆ పని పూర్తిచేసింది. నలుగురు అస్ట్రోనాట్లతో స్పేస్ఎక్స్ రాకెట్ విజయవంతంగా ఐఎస్ఎస్ వైపు దూసుకెళ్లింది. ఈ బృందానికి జెస్సికా మెయిర్ నాయకత్వం వహిస్తున్నారు. ఐఎస్ఎస్‌లో ప్రస్తుతం ముగ్గురు వ్యోమగాములు విధుల్లో ఉన్నారు. కొత్తగా నలుగురి రాకతో వారి సంఖ్య ఏడుకు చేరుకోబోతోంది. ఐఎస్ఎస్‌లో ప్రయోగాలు ఇక యథాతథంగా కొనసాగుతాయి. ప్రస్తుతం వాయిదా పడిన స్పేస్‌వాక్‌లు మళ్లీ మొదలవుతాయి.

రెండో ఫ్రాన్స్ మహిళగా అడెనోట్ రికార్డు

చందమామతోపాటు అంగారక యాత్రలకు నాసా సిద్ధమవుతోంది. భవిష్యత్తులో అక్కడికి మానవ సహిత యాత్రలు చేపట్టాలని నిర్ణయించింది. ఈ యాత్రలు విజయవంతం కావాలంటే వ్యోమగాముల ఆరోగ్యం అత్యంత కీలకం. అంతరిక్ష నౌకల్లో ఉండే వనరులు ఉపయోగించుకుంటూ ఆరోగ్యం కాపాడుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం పరీక్షలు జరుగుతున్నాయి. ఇదిలా ఉండగా, అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన రెండో ఫ్రాన్స్ మహిళా వ్యోమగామిగా సోఫీ అడెనోట్ రికార్డు కెక్కారు. 1996లో క్లాడీ హెగ్‌నెరీ రష్యా స్పేస్ స్టేషన్‌కు వెళ్లొచ్చారు. అప్పట్లో సోఫీ అడెనోట్ వయసు కేవలం 14 ఏళ్లు. క్లాడీ హెగ్‌నెరీ సాధించిన విజయాలు చూసి స్ఫూర్తి పొందారు. కేప్ కెనావెరాల్ నుంచి సోఫీ అడెనోట్‌కు హెగ్‌నెరీ వీడ్కోలు పలకడం విశేషం. జాక్ హాథ్‌వే ఐఎస్ఎస్‌కు వెళ్లడం ఇది తొలిసారి. జెస్సికా మెయిర్, ఆంద్రీ ఫెడియేవ్ రెండోసారి వెళ్తున్నారు. అంతరిక్ష ప్రయోగాల్లో వారికి చక్కటి అనుభవం ఉంది.

డబ్బుఉందా? డెబిట్! లేదా? క్రెడిట్!

భారత్‌లో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ మరో కీలక మలుపు తీసుకుంటోంది. అంతర్జాతీయ చెల్లింపుల దిగ్గజం వీసా త్వరలో భారత్‌లో ఒకే కార్డుతో అటు డెబిట్‌కి, ఇటు క్రెడిట్‌కి రెండు విధాలుగా ఉపయోగపడేలా 'డెబిట్-కమ్-క్రెడిట్ కార్డు'ను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ఈ కొత్త విధానం వినియోగదారులకు సౌకర్యాన్ని పెంచడమే కాకుండా, దేశంలో క్రెడిట్ వినియోగాన్ని విస్తరించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

యూపీఐ, డెబిట్, క్రెడిట్ కార్డులతో పోలిస్తే

ప్రస్తుతం భారత్‌లో యూపీఐ వేగంగా విస్తరిస్తున్నప్పటికీ, అది ప్రధానంగా బ్యాంక్ సేవింగ్స్ ఖాతా నుంచి నేరుగా డబ్బు కట్ అయ్యే విధానమే. డెబిట్ కార్డులు కూడా ఖాతాలో డబ్బు ఉంటేనే పనిచేస్తాయి. మరోవైపు, క్రెడిట్ కార్డులు సౌకర్యవంతమే అయినా వాటి వినియోగం డిజిటల్ రూపంలో,యూపీఐ చెల్లింపుల విషయంలో ఇంకా పరిమితంగానే ఉంది. ఈ నేపథ్యంలో వీసా తీసుకొస్తున్న కొత్త కార్డు యూపీఐతో అందే సౌలభ్యం, డెబిట్ కార్డుతో చేయగల నియంత్రణ, క్రెడిట్ కార్డు ఫ్లెక్సిబిలిటీ ఈ మూడింటినీ కలిపిన ఉపయోగకరమైన సాధనంగా మారనుందని విశ్లేషకులు అంటున్నారు.

బ్యాంకులు, వినియోగదారులకు లాభాలు

ఈ కొత్త విధానం ద్వారా బ్యాంకులు తమ రిస్క్ పాలసీలకు అనుగుణంగా క్రెడిట్ వినియోగాన్ని నియంత్రించగలుగుతాయి. వినియోగదారులకు మాత్రం ఒకటి కంటే ఎక్కువ కార్డులని ప్రతిచోటుకూ మోసుకెళ్లాల్సిన అవసరం ఉండదు. ముఖ్యంగా స్థిర ఆదాయం ఉన్నా క్రెడిట్ కార్డు లేని మధ్యతరగతి వర్గానికి ఇది ఉపయోగకరంగా మారే అవకాశం ఉంది.

ఆర్థిక వ్యవస్థపై ప్రభావం

నిపుణుల అంచనాల ప్రకారం, ఈ విధానం నగదు వినియోగాన్ని తగ్గించడంలో, టైర్-2, టైర్-3 నగరాల్లో కార్డు వినియోగాన్ని పెంచడంలో, ఫార్మల్ ఎకానమీని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. అయితే, అతిగా క్రెడిట్ వినియోగం వల్ల వినియోగదారుడు అప్పుల ఊబిలో కూరుకునే ప్రమాదం కూడా ఉందని, అందుకే ప్రజల్లో ఆర్థిక అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. వీసా ప్రతిపాదిస్తున్న ఈ డెబిట్-కమ్-క్రెడిట్ కార్డు భారత్ చెల్లింపుల వ్యవస్థను మరింత స్మార్ట్‌గా, ఫ్లెక్సిబుల్‌గా మార్చే విధానంగా పరిగణించవచ్చు. ఇది వినియోగదారుల సౌకర్యం, బ్యాంకులకు భద్రత ఈ రెండింటికీ మధ్య సమతుల్యత తీసుకురావచ్చని విశ్లేషకుల అభిప్రాయం.

కార్డు కాదు కాంబోప్యాక్

వీసా అభివృద్ధి చేసిన 'ఫ్లెక్సిబుల్ క్రెడెన్షియల్ (వీసా ఫ్లెక్స్) ' టెక్నాలజీ ఆధారంగా ఈ కార్డు పనిచేస్తుంది. 16 అంకెల ఒకే కార్డు నంబర్ ద్వారా కస్టమర్ లావాదేవీ చేసే సమయంలో అది అవసరాన్ని బట్టి డెబిట్‌గా లేదా క్రెడిట్‌గా వాడుకోవచ్చు. చెల్లింపు ఎలా జరగాలన్నది కస్టమర్ కొనుగోలు చేసే విలువ మొత్తం, లేదా వినియోగదారు ముందుగా ఎంచుకున్న సెట్టింగ్స్ ఆధారంగా ఆటోమేటిక్‌గా నిర్ణయమవుతుంది. ఉదాహరణకు, రోజువారీ చిన్న ఖర్చులు డెబిట్‌గా, పెద్ద కొనుగోళ్లు క్రెడిట్‌లో జరిగేలా ఈ కార్డును సెట్ చేసుకోవచ్చు.

భారత్ ఎందుకు కీలక మార్కెట్?

భారత్‌లో క్రెడిట్ కార్డు వినియోగం అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే తక్కువ. అదే సమయంలో నగదు లావాదేవీల వాటా చాలా పెద్దది. ఈ పరిస్థితిలో ఒకే కార్డు ద్వారా డెబిట్-క్రెడిట్ సౌకర్యం ఇవ్వడం వల్ల డిజిటల్ చెల్లింపులు మరింత విస్తరించవచ్చని వీసా భావిస్తోంది.

ఒక్కరోజే రూ. 20వేలు డౌన్

బంగారం, వెండి ధరలు ఊహకందని విధంగా మారిపోతున్నాయి. గత వారంలో రూ. 3.20 లక్షలకు చేరింది సిల్వర్ రేటు.. ఇప్పుడు తగ్గుముఖం పట్టింది. ఈ రోజు (శుక్రవారం) ధర రూ. 20,000 తగ్గింది. దీంతో కేజీ రేటు రూ. 2.80 లక్షలకు చేరింది. ఫిబ్రవరి 9న రూ.3 లక్షల వద్ద ఉన్న కేజీ సిల్వర్ రేటు.. ఆ తరువాత మూడు రోజులు స్థిరంగా ఉండి.. నేడు (ఫిబ్రవరి 13) రూ. 20వేలు తగ్గింది. రానున్న రోజుల్లో ఇంకా తగ్గుతుందా?, పెరుగుతుందా? అనే ఆందోళన చాలామంది పెట్టుబడిదారుల్లో మొదలైంది. గ్లోబల్ మార్కెట్లో కూడా వెండి రేటు 9 శాతం తగ్గి 76.53 డాలర్ల వద్దకు చేరింది.ధరలు తగ్గడానికి ప్రధాన కారణం..గ్లోబల్ మార్కెట్లో వస్తున్నా పరిణామాలే అని తెలుస్తోంది. ఇన్వెస్టర్ల ప్రాఫిట్ బుకింగ్ కూడా దీనిపై ప్రభావం చూపింది. అయితే.. భవిష్యత్తులో సిల్వర్ రేటు పెరుగుతుందని కియోసాకి వంటి నిపుణులు చెబుతున్నారు. 2025 నాటి వెండి రేటుకు.. 2026 వెండి రేటుకు చాలా తేడా ఉంది. ఏడాది కాలంలో ధర రూ. 153 శాతం పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. గత సంవత్సరం జనవరి రూ. 90వేలు వద్ద ఉన్న కేజీ సిల్వర్ రేటు.. ఈ ఏడాది జనవరి రూ.3 లక్షలు దాటేసింది. దీన్నిబట్టి చూస్తే.. వెండి రేటు ఏ స్థాయిలో పెరిగిందో అర్థం చేసుకోవచ్చు.

వెండి ధరలు పెరగడానికి కారణాలు

వెండిని.. ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక శక్తి, టెలికాం, వైద్య సాంకేతికత, బయోఫార్మా వంటి పరిశ్రమలలో విరివిగా ఉపయోగిస్తున్నారు. అంతే కాకుండా.. సౌర ఫలకాలు, బ్యాటరీలు, ఎలక్ట్రానిక్ భాగాలలో కూడా సిల్వర్ కీలకంగా మారింది. ఇవన్నీ వెండి డిమాండును అమాంతం పెంచడంలో దోహదపడ్డాయి. ఇది ధరలను భారీగా పెంచే అవకాశం ఉందని చేబడుతున్నారు

ఎన్‌పీసీఐ భారత్ కనెక్ట్‌తో ఎన్‌టీటీ డేటా జట్టు

ఎన్‌పీసీఐ భారత్ కనెక్ట్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ఎన్‌టీటీ డేటా బిజినెస్ సొల్యూషన్స్ వెల్లడించింది. హైదరాబాద్‌లో నిర్వహించిన ట్రాన్స్‌ఫర్మేషన్ నౌ వార్షిక కార్యక్రమం సందర్భంగా ఇందుకు సంబంధించిన ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది. సంక్లిష్టమైన వ్యవస్థల కారణంగా మధ్య, భారీ స్థాయి కంపెనీలు బీ2బీ చెల్లింపుల విషయంలో పలు సవాళ్లు ఎదుర్కొంటాయని ఎన్‌టీటీ డేటా బిజినెస్ సొల్యూషన్స్ ఎండీ కృణాల్ పటేల్ తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఎస్ఏపీ సాఫ్ట్‌వేర్‌ని ఉపయోగించే సంస్థల మధ్య బీ2బీ చెల్లింపులను సరళతరం చేసేందుకు ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫర్మేషన్ నౌ కార్యక్రమంలో 1,500 మంది పైగా సీఎక్స్‌వోలు, పరిశ్రమ దిగ్గజాలు పాల్గొన్నారు. డేటా సార్వ□మత్వం, బాధ్యతాయుతంగా కృత్రిమ మేధను వినియోగించడం తదితర అంశాలపై చర్చించారు. ఆటోమోటివ్, కెమికల్స్, తయారీ తదితర రంగాల్లో ఎస్ఏపీ ఆధారిత వ్యూహాల అమలు తీరు తెన్నులను ఈ సందర్భంగా ప్రదర్శించారు. ఎన్‌టీటీ డేటా బిజినెస్ సొల్యూషన్స్ గ్లోబల్ సీఈవో నార్బర్ట్ రోటర్‌తో పాటు ఎన్‌పీసీఐ భారత్ కనెక్ట్ అధికారులు ఇందులో పాల్గొన్నారు.

'బంగ్లా' ఎన్నికల్లో హిందూ అభ్యర్థి ఘన విజయం

ఢాకా: బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో హిందువులకు సంతోషాన్ని పంచే పరిణామం చోటుచేసుకుంది. నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ)కి చెందిన హిందూ అభ్యర్థి గయేశ్వర్ చంద్ర రాయ్ ఢాకా3 నియోజకవర్గం నుంచి ఘన విజయం సాధించారు. హోరాహోరీగా సాగిన ఈ పోరులో ఆయన తన సమీప ప్రత్యర్థి, జమాతే ఇస్లామీ నేత మహమ్మద్ షాహినూర్ ఇస్లాంను ఓడించారు. గయేశ్వర్ చంద్ర రాయ్‌కు మొత్తం 98,785 ఓట్లు రాగా, జమాత్ అభ్యర్థికి 82,232 ఓట్లు మాత్రమే లభించాయి. రాయ్ సాధించిన ఈ విజయం బంగ్లాదేశ్ పార్లమెంటులో హిందువుల గళాన్ని వినిపిండానికి దోహదపడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. గయేశ్వర్ చంద్ర రాయ్ 1951, నవంబర్ ఒకటిన ఢాకాలోని కెరానిగంజ్‌లో జ్ఞానేంద్ర చంద్ర రాయ్, సుమతి రాయ్ దంపతులకు జన్మించారు. 1990వ దశకంలో బీఎన్‌పీ నేతృత్వంలోని ప్రభుత్వాలలో ఆయన కీలక పాత్రలు పోషించారు. పర్యావరణ, అటవీ శాఖ సహాయ మంత్రిగా, మత్స్య, పశుసంవర్ధక శాఖ సహాయ మంత్రిగా సేవలు అందించారు. రాజకీయాలతో పాటు ఆయన కుటుంబానికి బీఎన్‌పీ అగ్రనాయకత్వంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. రాయ్ కుమారుడు అమితాబ్ రాయ్, బీఎన్‌పీ నేత నితాయ్ రాయ్ చౌదరి కుమార్తె నిపున్ రాయ్ చౌదరిని వివాహం చేసుకున్నారు. ఈ ఎన్నికల ఫలితాలలో తారిఖ్ రెహమాన్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) భారీ విజయం దిశగా దూసుకుపోతోంది. ఇప్పటికే 200 కంటే ఎక్కువ స్థానాలను కైవసం చేసుకున్న బీఎన్‌పీ

త్వరలోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది. తారిఖ్ రెహమాన్ బంగ్లాదేశ్ తదుపరి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. ఈ ఫలితాలతో జమాతే ఇస్లామీ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దేశంలో గత 18 నెలలుగా కొనసాగుతున్న ముహమ్మద్ యూనస్ తాత్కాలిక పాలనకు ముగింపు పలికేలా ఈ ఎన్నికల తీర్పు వెలువడింది. బంగ్లాదేశ్ ఎన్నికల సంఘం తుది ఫలితాలను అధికారికంగా ప్రకటించాల్సి ఉన్నప్పటికీ, బీఎన్‌పీ విజయం దాదాపు ఖాయమైంది. ఆగస్టు 2024లో అవామీ లీగ్ ప్రభుత్వం పడిపోయిన తర్వాత ఏర్పడిన ముహమ్మద్ యూనస్ తాత్కాలిక ప్రభుత్వం స్థానంలో కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు ఈ పోలింగ్ జరిగింది. మొత్తం 12.7 కోట్ల మంది అర్హులైన ఓటర్లు ఉండగా, అందులో సగం మంది 1837 ఏళ్ల మధ్య వయస్సు గల యువతే కావడం గమనార్హం. 299 నియోజకవర్గాల్లో జరిగిన ఈ ఎన్నికల్లో 59 పార్టీల నుంచి 1,700 మందికి పైగా అభ్యర్థులు పోటీ పడగా, బీఎన్‌పీ తన ఆధిపత్యాన్ని చాటుకుంది.

మాజీ ప్రధాని హసీనా మరణ శిక్షపై ఉత్కంఠ

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ ఎన్నికల్లో తారిక్ రెహమాన్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) అధికారంలోకి రానుండటంతో, భారత్‌లో ఆశ్రయం పొందుతున్న మాజీ ప్రధాని షేక్ హసీనా భవితవ్యం చర్చనీయాంశంగా మారింది. 2024 జూలై నాటి విద్యార్థి ఉద్యమంపై ఉక్కుపాదం మోపినందుకు.. 2025 నవంబర్‌లో బంగ్లాదేశ్‌లోని ఒక ప్రత్యేక ట్రిబ్యునల్ హసీనాకు మరణశిక్ష విధించింది. ఈ నేపథ్యంలో బీఎన్‌పీ ఇటీవలి ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు హసీనాను బంగ్లాదేశ్‌కు రప్పించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం న్యూఢిల్లీలో ప్రవాస జీవితం గడుపుతున్న షేక్ హసీనా.. బంగ్లాదేశ్‌లో జరిగిన ఎన్నికలను ఒక ప్రహసనంగా అభివర్ణించారు. జనవరి 2026లో ఆమె ఢిల్లీ నుండి చేసిన ఒక ఒక ప్రసంగంలో.. ముహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వంపై తిరుగుబాటు చేయాలని ప్రజలకు పిలుపునిచ్చి, బంగ్లాదేశ్ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించారు. కాగా మానవత్వానికి వ్యతిరేకంగా హసీనా నేరాలకు పాల్పడినట్లు రుజువైనందున, ఆమెను 'భారత్‌బంగ్లాదేశ్ అప్పగింత ఒప్పందం' కింద తిరిగి తమ దేశానికి పంపాలని బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ ఇప్పటికే భారత్‌ను కోరింది. మరణశిక్ష పడిన వ్యక్తికి ఆశ్రయం కల్పించడం న్యాయవ్యవస్థను అవమానించడమేనని బంగ్లాదేశ్ నేతలు అంటున్నారు. ఈ సున్నిత అంశంపై భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్

గతంలో కీలక వ్యాఖ్యలు చేశారు. హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమిట్ 2025లో ఆయన మాట్లాడుతూ, హసీనా 'కొన్ని విలక్షణమైన పరిస్థితులలో' భారత్‌కు వచ్చారని, ఆమె భవిష్యత్తు గురించి తుది నిర్ణయం ఆమె చేతుల్లోనే ఉంటుందని పేర్కొన్నారు. ట్రిబ్యునల్ తీర్పును భారత్ గమనించిందని చెబుతూనే, హసీనా అప్పగింత విషయంలో భారత్ ఆచి తూచి అడుగులు వేస్తున్నదన్నారు.

తృటిలో తప్పిన పెను విమాన ప్రమాదం

27వేల అడుగుల ఎత్తులో ఇంజిన్ పేలుడు

అబుజా: ఇటీవల కాలంలో ప్రపంచంలోని పలు దేశాల్లో వరుస విమాన ప్రమాదాలు ప్రయాణికుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. విమానం ప్రయాణం ఎక్కితే గమ్య స్థానానికి చేరుకోగలమా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ తరుణంలో ఓ విమానం ఘోర విమాన ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకుంది. 80 మంది ప్రయాణికులు సురక్షితంగా ప్రాణాలతో బయట పడ్డారు. లాగోస్ నుండి పోర్ట్ హార్కోర్ట్ వెళ్తున్న అరిక్ ఎయిర్ విమానాయన సంస్థకు చెందిన బోయింగ్ 737700 విమానం బుధవారం ఉదయం 7:24 గంటలకు బయల్దేరింది. సుమారు 27 వేల అడుగుల ఎత్తులో ప్రయాణిస్తున్న సమయంలో ఎడమ ఇంజిన్‌లో భారీ శబ్దం వినిపించింది. ఇంజిన్‌లో పేలుడు సంభవించి, లోపలి భాగాలు తునాతునకలయ్యాయి. ఫ్యాన్ బ్లేడ్లు విరిగిపోయాయి. అప్రమత్తమైన పైలెట్లు విమానాన్ని బెనిన్ ఎయిర్‌పోర్ట్ వైపు మళ్లించి, ఉదయం 8:05 గంటలకు అత్యవసర ల్యాండింగ్ చేశారు. 80 మంది ప్రయాణికులు, సిబ్బంది ఎవరికి ఎలాంటి ప్రాణహాని జరగలేదు. ల్యాండింగ్ సమయంలో ఇంజిన్ కవచం చీలిపోవడంతో లోపలి భాగాలు బయటకు కనిపించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఏవియేషన్ సేఫ్టీ నెట్‌వర్క్ నివేదికల ప్రకారం.. ఇంజిన్ ఇన్లెట్ భాగం పూర్తిగా విరిగిపోయింది. దీనిని 'ఫ్యాన్ బ్లేడ్ ఆఫ్' ఘటనగా పరిగణిస్తున్నారు. ఇంజిన్ నుండి

విడిపోయిన లోహపు ముక్కలు విమానం వెనుక భాగంలోని వర్టికల్ స్టెబిలైజర్‌ను కూడా దెబ్బతీశాయని పరిశీలకులు గుర్తించారు. నైజీరియన్ సేఫ్టీ ఇన్వెస్టిగేషన్ బోర్డు ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించింది. బెనిన్‌లో విమానాన్ని నిలిపి, సాక్ష్యాలను సేకరించడం, సిబ్బందిని ప్రశ్నించడం, ఫ్లైట్ డేటా, కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌ను పరిశీలిస్తున్నారు.

ఫ్యాన్ బ్లేడ్ ఆఫ్ అంటే..

ఫ్యాన్ బ్లేడ్ ఆఫ్ (Fan BladeOff) అనేది విమాన ఇంజిన్‌లలో జరిగే ఒక తీవ్రమైన సాంకేతిక లోపాన్ని సూచించే పదం. టర్బోఫ్యాన్ ఇంజిన్‌లో గాలి పీల్చుకునే భాగంలో పెద్ద ఫ్యాన్ బ్లేడ్లు ఉంటాయి.వీటిలో ఒక బ్లేడ్ విరిగి, ఇంజిన్ లోపల నుంచి బయటకు త్రోసుకుపోతే దాన్ని Fan BladeOff (FBO) ఘటన అంటారు. ఇది చాలా ప్రమాదకరమైన పరిస్థితి,ఎందుకంటే విరిగిన బ్లేడ్ ముక్కలు ఇంజిన్‌ను, విమానం ఇతర భాగాలను దెబ్బతీసేయొచ్చు.

'డార్క్ ప్రిన్స్' నుంచి... ప్రధాని పీఠం దాకా!

తారిఖ్ రహ్మాన్. 19 ఏళ్ల ప్రవాసం వీడి తిరిగొచ్చిన నెలన్నర వ్యవధిలోనే బంగ్లా ప్రధాని కాబోతున్న నాయకుడు. 'డార్క్ ప్రిన్స్'గా ఇంటాబయటా అప్రతిష్టపాలైన నేపథ్యం నుంచి ప్రధాని పీఠాన్ని అందిపుచ్చుకునే దాకా 60 ఏళ్ల రహ్మాన్‌ది నిజంగా ఆసక్తికర ప్రస్థానమే. ఆయన తండ్రి దివంగత ముజిబుర్ రహ్మాన్ దేశాధ్యక్షునిగా పని చేశారు. ఇక తల్లి బేగం ఖలీదా జియా ప్రధానిగా కొనసాగారు. 2001 నుంచి 2006 మధ్య ఆమె హయాంలో రహ్మాన్ రెండో అధికార కేంద్రంగా మారారన్న చెడ్డపేరు మూటగట్టుకున్నారు. పాలనతో సహా అన్ని వ్యవహారాలనూ తన కనుసన్నల్లో శాసించారంటారు. దాంతో విపక్షాలు, సొంత పార్టీలోని అసమ్మతివాదులే గాక అమెరికా కూడా రహ్మాన్‌ను 'డార్క్ ప్రిన్స్'గా అభివర్ణించాయి. అంతేగాక ఆ సమయంలో ఆయనపై లెక్కకు మించి అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన అవామీ లీగ్ సారథి షేక్ హసీనా వాటిపై విచారణకు ఆదేశించారు. ఒక కేసులో రహ్మాన్ అరెస్టయ్యారు కూడా. బెయిల్‌పై విడుదలైన అనంతరం వైద్యచికిత్స పేరుతో 2008లో లండన్ వెళ్లారు. నాటినుంచీ కుటుంబంతో పాటు అక్కడే ప్రవాసంలో గడుపుతూ వచ్చారు. లండన్ నుంచే పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తూ వచ్చారు.

అస్థిరతే అదనుగా...

2024 ఆగస్టులో విద్యార్థి ఆందోళనల ముసుగులో చెలరేగిన దేశవ్యాప్త అల్లర్లతో నాటి ప్రధాని హసీనా గద్దె దిగాల్సి వచ్చింది. అంతేగాక రాత్రికి రాత్రే ఆమె దేశం వీడి భారత్ చేరుకున్నారు. అనంతరం బంగ్లాలో అల్లకల్లోలం, అస్థిరత నెలకొన్నాయి. ఎటుచూసినా హింసాకాండ పెచ్చరిల్లింది. నోబెల్ గ్రహీత మహ్మద్ యూనుస్ సారథ్యంలో ఏర్పడ్డ మధ్యంతర సర్కారు వాటికి అడ్డుకట్ట వేయడంలో పూర్తి విఫలమైంది. పరిస్థితులు పెనం నుంచి పొయ్యిలోకి జారి రాజకీయ శూన్యం నెలకొన్న తరుణంలో గత డిసెంబర్ 25న రహ్మాన్ ప్రవాసం వీడి సొంతగడ్డపై అడుగుపెట్టారు. బీఎన్‌పీ కార్యకర్తలతో పాటు అభిమానులు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. తల్లి వయోభారం, అనారోగ్యం నేపథ్యంలో పార్టీని అన్నీ తానై నడిపించారు. జియా మరణానంతరం పార్టీ పగ్గాలు చేపట్టి ఎన్నికల రంగంలోకి దూకారు. బంగ్లా ఫస్ట్ నినాదంతో యువతతో పాటు వృద్ధులనూ ఆకట్టుకున్నారు. బీఎన్‌పీకి మూడింట రెండొంతుల మెజారిటీ సాధించి పెట్టి దేశంలోకి అడుగు పెట్టిన నెలన్నర లోపే ప్రధానిగా అధికార పగ్గాలు చేపట్టనున్నారు! అయితే కోరలు చాస్తున్న మత వైషమ్యాలకు అడ్డుకట్ట వేయడం, ముఖ్యంగా అరాచక శక్తులకు ముకుతాడు వేయడం, దేశాన్ని ప్రగతి వైపు నడపడం ఆయనకు కఠిన పరీక్ష కానుంది. రహ్మాన్ భార్య డాక్టర్ జుబైదా బంగ్లా నేవీ మాజీ చీఫ్ కూతురు. వారికి కూతురు జైమా జర్నాజ్ ఉన్నారు.

భారత్ పట్ల సానుకూలతే!

షేక్ హసీనా పూర్తిగా భారత అనుకూల నేతగా పేరుపడగా ఖలీదా జియాది మాత్రం పూర్తిగా భిన్న వైఖరి. భారత్‌తో ఆమె ఎప్పుడూ అంటీ ముట్టనట్టుగానే వ్యవహరిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో జియా కుమారునిగా రహ్మాన్ తీరు ఎలా ఉంటుందోనని ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా హసీనా పదవీచ్యుతి అనంతరం గత ఏడాదిన్నరగా బంగ్లాలో భారత వ్యతిరేకత భావజాలం పరాకాష్టకు చేరింది. దానికి యూనుస్ సర్కారుకూడా పరక్షంగా దన్నుగా నిలిచింది. వీలు దొరికినప్పుడల్లా భారత వ్యతిరేక వ్యాఖ్యలు చేయడమే గాక క్రమంగా మన దాయాది పాకిస్తాన్‌కు దగ్గరవుతూ వచ్చింది. ఇదే అదనుగా బంగ్లాలో మతోన్మాద మూకలు కొన్నాళ్లుగా రెచ్చిపోతున్నాయి. మైనారిటీలపై, ముఖ్యంగా హిందువులపై దమనకాండకు దిగుతున్నాయి. ఆ క్రమంలో హిందువుల హత్యలతో బంగ్లా అట్టుడుకుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో బంగ్లాలో అడుగుపెట్టిన రహ్మాన్, తనది మాత్రం భారత వైఖరి అనుకూల వైఖరేనని ఆదినుంచీ స్పష్టమైన సంకేతాలిస్తూ వచ్చారు. ఉగ్రవాదంపై భారత్ పోరుకు సహకరిస్తామని కూడా ఆయన స్పష్టం చేశారు. తీస్తా నదీజలాల విషయంలో నెలకొన్న వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించుకుంటామని చెప్పారు. భారత్, బంగ్లా సంబంధాలు మెరుగుపడే దిశగా ఇవన్నీ సానుకూల సంకేతాలేనని భావిస్తున్నారు. దీనికితోడు 2001-06 మధ్య బీఎన్‌పీతో అధికారాన్ని పంచుకున్న రాడికల్ పార్టీ జమాతే ఇస్లామీని ఈసారి రహ్మాన్ దూరం పెట్టారు. ఒంటరిగానే పోటీ చేసి విజయం సాధించారు. ఇది కూడా భారత్‌కు కలిసొచ్చే అంశమే. ఆయన పగ్గాలు చేపట్టాక ఇరుదేశాల నడుమ వాణిజ్యంతో పాటు అన్నిరంగాల్లోనూ సంబంధాలు మెరుగవుతాయన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.